సాక్షి జగిత్యాల

సోమవారం, 25, సెప్టెంబర్, 2023

ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ బంద్

8లో

సెల్ఫీ విత్ మట్టిగణేశా..

పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుని ప్రతిష్ఠించారా.. ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి వినాయకులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశునితో సెల్ఫీఫొటో తీసుకుని సెల్ నంబరు 95426 16103కు వాట్సప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.



న్యూస్‌రీల్

ఊరంతటికీ ఒకే వినాయకుడు



తాళ్లకొత్తపేటలో కొలువైన వినాయకుడు

వెల్గటూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాళ్లకొత్తపేటలో ఒకే వినాయకుడిని ప్రతిష్ఠించి ఐకమత్యాన్ని చాటుకున్నారు ఆ గ్రామస్తులు. గ్రామం లోని బొడ్రాయి వద్ద యువకులంతా కలిసి మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మండపాన్ని అలంకరించిన తీరు ఆకట్టుకుంటోంది. గుహనుంచి దండకారణ్యం మీదుగా వెళ్లి మంచుకొండల్లో నెలవై ఉన్న విఘ్నేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఎంతో వైవిధ్య భరితంగా ఉన్న ఈ విఘ్నేశ్వరున్ని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు తరలివస్తున్నారు.

అక్టోబర్ మొదటి వారంలో కేటీఆర్ జిల్లా పర్యటన



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లాకేంద్రంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు మంత్రి కేటీఆర్ జిల్లాకు అక్టోబర్ మొదటి వారంలో వస్తున్నట్లు మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. మంత్రి పాల్గొనే కార్యక్రమాలు, బహిరంగ సభ నిర్వహించే వివేకానంద మినీ స్టేడియం, చల్‌గల్ పండ్ల మార్కెట్‌ను ఆదివారం పరిశీలించారు. వారివెంట జెడ్పీచైర్ పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్ దివాకర్, డీఎస్పీ వెంకటస్వామి ఉన్నారు.

ధర్మపురిలో..



ధర్మపురి: రాష్ట్ర పురపాలక మంత్రి అక్టోబర్ 3న ధర్మపురికి వస్తున్నారని మంత్రి కొప్పుల తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు, సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న తదితరులున్నారు.

కాకతీయ కాల్వకు 5 వేల క్యూసెక్కుల నీరు



కాకతీయ కాల్వ ద్వారా ప్రవహిస్తున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి జిల్లాకు సాగునీటిని తీసుకొచ్చే కాకతీయ మెయిన్‌కు కాలువకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 21,620 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. కాకతీయ కాల్వకు 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 540 క్యూసెక్కులు, వరద కాల్వకు 15 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 1091.00 అడుగులు, 90.313 టీఎంసీలుగా ఉంది.

చెగ్యాం పునరావాస బాధితులకు పరిహారం

వెల్గటూర్: మండలంలోని చెగ్యాం పునరావాస బాధితులకు పరిహారం మంజూరుచేస్తూ ప్రభుత్వం ఆదివారం జీవో విడుదల చేసింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన సుమారు 135 కుటుంబాలు పరిహారం కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్నాయి. పాత గ్రామంలోనే శిథిలావస్థకు చేరిన ఇళ్లలో కొందరు, పాఠశాల భవనంలో మరికొందరు నివసిస్తూ పరిహారం కోసం నిరాహార దీక్ష చేశారు. వారి పోరాటం ఫలించింది. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకొని నిర్వాసితులకు పరిహారం అందించేలా కృషి చేశారు. దీంతో ప్రభుత్వం వారికి రూ.18కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.

నిత్యాన్నదానం కొందరికే..!

- స్వామివారి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు
- అన్నప్రసాదం మాత్రం కేవలం వంద మందికే..
- ఆకలితోనే దిగువకు చేరుకుంటున్న వైనం
- కనీసం 500 మందికి పెంచితే మేలు



కొండగట్టు నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు చేస్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): జిల్లాలోని కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో 2004 నుంచి నిత్యాన్నదానం చేస్తున్నారు. ఆ సమయంలో 20మందితో మొదలైన అన్నప్రసా దం పంపిణీ.. పదేళ్లు సమీపిస్తున్నా.. వంద మందికి మాత్రమే అందిస్తోంది. శనివారం, మంగళవారాల్లో 200 మందికి భోజనం అందిస్తున్నా రు. దీంతో స్వామివారిని దర్శించుకునేందుకు ప్ర తిరోజూ వచ్చే వేలాది మంది భక్తులు ఆకలితోనే ఉండిపోవాల్సి వస్తోంది. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రతిరోజూ సుమారు 500 మంది భక్తులకైనా అన్నప్రసాదం అందించాలన్న వాదన వినిపిస్తోంది.

నిత్యం 500 మందికి పెంచాలి

అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. దైవదర్శనం చేసుకున్న భక్తులకు అన్నప్రసాదం అందిస్తే వారిలో ఆనందం రెట్టింపవుతుంది. ఇలాంటి వారికోసమే అన్నట్లు.. కొండగట్టుకు వచ్చే అంజన్న భక్తులకు దాదాపు 20 ఏళ్ల నుంచి పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన భోజనం అందిస్తున్నారు ఆలయ అధికారులు. అయితే స్వామివారి దర్శనానికి ప్రతిరోజూ 10వేల మంది.. రద్దీ రోజుల్లో అయితే సుమారు 35వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. కానీ.. అన్నప్రసాదం పంపిణీ మాత్రం కేవలం ఉదయం 11 గంటలకు 100 మందికే భోజన వసతి కల్పిస్తున్నారు. శనివారం, మంగళవారాల్లో మాత్రం మరో వందమందికి అదనంగా టోకెన్లు ఇచ్చి భోజనం అందిస్తున్నారు. దీంతో దర్శనానికి వచ్చిన వచ్చిన భక్తులు టోకెన్ల కోసం ఎగబడాల్సి వస్తోంది. తీరా అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజూ కనీసం 500 మందికైనా ఉచితంగా అన్నప్రసాదం అందిస్తే భక్తుల ఆకలి తీర్చిన వారవుతారని అంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారి వద్ద భోజనం చేయాలనే తాపత్రాయం వారిలో ఉంటుంది. అటు వారి మనోభావాలు దెబ్బతినకుండా.. ఇటు ఆలయానికి వచ్చే ఆదాయంలో కొంత మొత్తమైనా భక్తులకు ఖర్చు చేస్తే బాగుంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న అన్నదానసత్రం భవనం చిన్నదిగా ఉంది. దానిని మరోచోటకు తరలించి.. భక్తులకు సరిపడా సౌకర్యాలు కల్పించేలా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

అన్నప్రసాదం దొరకడం లేదు



మాది వేములవాడ. కొండగట్టుకు అంజన్నస్వామివారి దర్శనానికి వచ్చాను. అన్నప్రసాదం కోసం లైన్‌లో నిల్చున్న. నిత్యాన్నదానసత్రంకు వెళ్తే అప్పటికే టోకెన్లు అయిపోయాయని అన్నారు. కొండకు వచ్చే భక్తులందరికీ భోజనం అందించేలా అధికారులు చొరవ చూపాలి.

– నర్సయ్య, భక్తుడు, వేములవాడ

వెయ్యి మందికైనా అందించాలి



ఆలయానికి రూ.కోట్లలో ఆదాయం వస్తోందని అంటుంటారు. మరి అన్నప్రసాదం అందరికీ అందించకపోవడంలో ఆంతర్యం ఏమిటో. ప్రతిరోజూ 500 నుంచి వెయ్యి మందికి భక్తులకైనా భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలి. అన్నదానంతో ఆలయ ఖ్యాతి పెరుగుతుంది.

– చందన్, భక్తుడు, హైదరాబాద్

కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం



కొండపై నిత్యాన్నదాన సత్రంలో రోజుకు వంద మందికి అందిస్తున్నాం. శని, మంగళవారాల్లో 200 మందికి అందిస్తున్నాం. అదనంగా పెంచడంపై ముందుగా పాలకవర్గ సభ్యులు, ఈవోతో సమీక్ష నిర్వహిస్తాం. ఆ విషయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

– మారుతిస్వామి, ఆలయ చైర్మన్

రాయికల్ ఆసుపత్రిలో బెడ్ల కొరత

- పనిచేయని ఫ్యాన్లు
- ఇబ్బందుల్లో రోగులు



రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రి

రాయికల్: రాయికల్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఏడాది క్రితమే వైద్యవిధాన పరిషత్‌లోకి మారింది. అయినా ఈ ఆసుపత్రిలో వసతులు మాత్రం ఆ స్థాయిలో కల్పించడం లేదు. ఈ ఆసుపత్రికి పట్టణంతోపాటు చుట్టుపక్కల 32 గ్రామాల నుంచి నిరుపేదలు వైద్యం కోసం వస్తుంటారు. ఇటీవలి వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా వైరల్ ఫీవర్, డెంగీ వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆసుపత్రికి ప్రతిరోజూ సుమారు 250 మంది రోగులు వస్తున్నారు. వీరిలో 25మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు.

బెడ్ల కొరత.. పనిచేయని ఫ్యాన్లు

ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరుగుతున్నా.. సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ఈ ఆసుపత్రిలో 30 బెడ్లు మాత్రమే ఉండడంతో అవి ఎటూ సరిపోవడం లేదు. ఇందులో వార్డులో 17, గర్భిణుల కోసం 11 బెడ్లు కేటాయించారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల్లో అవి సరిపోవడం లేదు. వాటిని 50 పడకలకు పెంచాల్సిన అవసముందని రోగులు చెబుతున్నారు. సాధారణంగా ఇన్‌పేషెంట్లు మూడురోజుల పాటు వైద్య సేవలు పొందుతుంటారు. దీంతో కొత్తగా వచ్చిన రోగులకు బెడ్‌లు లేక ఇబ్బంది పడుతున్నారు. వైద్య సిబ్బందికి సైతం సేవలు అందించడం కష్టంగా ఉంది. మరోవైపు జనరల్ వార్డులో ఉన్న ఫ్యాన్లు సరిగా పనిచేయడం లేదు. ఫలితంగా దోమల బెడతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. వైద్య విధాన పరిషత్ అధికారులు స్పందించి ఆసుపత్రిలో బెడ్ల కొరత తీర్చాలని, ఫ్యాన్లకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

దోమలు విపరీతంగా ఉన్నాయి



మా అమ్మ అఫీఢ్ ఉన్నిసకు ఆరోగ్యం బాగోలేదని రాయికల్ ఆసుపత్రికి తీసుకొచ్చా. వైద్య సిబ్బంది సేవలు అందించినప్పటికీ వార్డులో ఫ్యాన్లు పనిచేయడం లేదు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫ్యాన్లను రిపేర్ చేయించాలి.

– ముబాసీర్, రాయికల్

మరమ్మతు చేయిస్తాం



ఆసుపత్రిలో ఫ్యాన్లకు మరమ్మతు చేయిస్తాం. బెడ్ల కొరతపై జిల్లా సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాం. సీజనల్ వ్యాధులతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. బెడ్ల కొరత ఉన్నమాట వాస్తవమే. సమస్యలు అన్ని పరిష్కరిస్తాం.

– రవి, సూపరింటెండెంట్





కుంకుమ పూజలు

రాయికల్/జగిత్యాలజోన్: రాయికల్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి 101 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు చింత శివకుమార్, ప్రధానకార్యదర్శి వెంకటరమణ, జనార్దన్ పాల్గొన్నారు. రెడ్డి జనసంక్షేమ సంఘం వినాయకుడి వద్ద మహిళలు కుంకుమపూజలు చేశారు.









సెల్ఫీ విత్ గణేశ్

'సాక్షి సెల్ఫీ విత్ గణేశ్'కు పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఫొటోలు పంపిస్తున్నారు. వెల్దుర్తిలో మట్టి గణపతితో గూడూరి జయప్రద, గోగికార్ శివకుమార్, గుమ్ముల వర్షిత్, భారతి బృందం సెల్ఫీ దిగారు.

– జగిత్యాలటౌన్

ప్రతి ఇంటికీ చేరుతున్న పథకాలు



గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- లబ్ధిపొందుతున్నవారు బీఆర్ఎస్ పక్షాన నిలబడాలి
- మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీల అందజేత

జగిత్యాల/జగిత్యాలరూరల్: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ బీఆర్ఎస్ పక్షాన నిలబడాలని మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు చెందిన 666 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు అందించారు. 14 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉండి చేయలేని అభివృద్ధిని బీఆర్ఎస్ కేవలం పదేళ్లలో చేసి చూపిందన్నారు. అసత్య ప్రచారం చేస్తూ.. ఓట్లు దండుకునేందుకు వస్తున్న కాంగ్రెస్ మాటలను నమ్మవద్దని కోరారు. ఆడబిడ్డలు, ప్రజలు తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కేడీసీసీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రైతుబంధు కన్వీనర్ కొల్ముల రమణ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సుధాకర్‌రావు పాల్గొన్నారు.

కులవృత్తులకు పెద్దపీట

కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి ఈశ్వర్ అన్నారు. గొల్లపల్లి రోడ్డులో టీయూఎఫ్ఐడీసీ క్యాట్ నిధులు రూ.2కోట్లతో నిర్మించనున్న ఆధునిక దోబీఘాట్‌ను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆదివారం ప్రారంభించారు. రజకులు, నాయిబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. అన్నివర్గాలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు శంకర్, నారయణ, పోచాలు ఉన్నారు.

పెండింగ్ బిల్లుల పరిష్కారానికి కృషి..

ఉపాధ్యాయుల జీపీఎఫ్, మెడికల్, సరెండర్ బిల్లులను తొలిదశలోనే ఇప్పించేలా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావుతో మాట్లాడి విడుదలకు కృషిచేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో పీఆర్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా కొందరు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనందరావు ఉన్నారు.

నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం

పేదలకు సీఎం సహాయనిధి వరమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటకు చెందిన గంగారెడ్డికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.14వేల చెక్కును అందించారు. సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

జిల్లా రైతులకు ఆత్మీయ సత్కారం



రైతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

జగిత్యాలఅగ్రికల్చర్: వినూత్నరీతిలో వ్యవసాయం చేస్తూ.. మంచి ఫలితాలు అందుకుంటున్న జిల్లా రైతులను హైదరాబాద్‌కు చెందిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆదివారం ఘనంగా సన్మానించింది. వ్యవసాయాన్ని కాపాడాలి-రైతుకు భరోసాగా ఉండాలనే సంకల్పంతో సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, రిటైర్డ్ జిల్లా వ్యవసాయాధికారి దన్నపునేని అశోక్‌కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సమీకృత వ్యవసాయం చేస్తున్న ఎడ్మల మల్లారెడ్డి(లక్ష్మీపూర్), ధాన్యాన్ని బియ్యంగా మార్చి మార్కెటింగ్ చేస్తున్న చందా సుధాకర్ (కండ్లపల్లి), మామిడిలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న ఎన్నం బాపురెడ్డి (జైనా), రైతులను సంఘటితం చేసి లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన సంఘం అధ్యక్షుడు పన్నాల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు గర్వందుల గంగయ్య, సంఘ డైరెక్టర్లు కొట్టాల మోహన్ రెడ్డి, మామిడి తిరుపతి రెడ్డి, మోతె రవీందర్ (లక్ష్మీపూర్) ఉత్తమ రైతులుగా అవార్డులు అందుకున్నారు.

బీపీ.. షుగర్.. నో ఫికర్

- అసంక్రమిత రోగాలపై ప్రభుత్వం దృష్టి
- బాధితులకు ప్రతినెలా ఉచితంగా మందులు
- రూ.10వేల విలువైన బీపీ యంత్రాల పంపిణీ



గొల్లపల్లి పీహెచ్‌సీలో ఎన్‌సీడీ కిట్ అందిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్

గొల్లపల్లి: బీపీ, షుగర్ వంటి జబ్బుల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని ఆసుపత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్) క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేసేలా రూ.10వేల విలువైన బీపీ యంత్రాలను పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు అందించింది. బాధితులకు ప్రతినెలా ఉచితంగా మందులు అందిస్తోంది. ఆసుపత్రుల్లో ఒక్కరు చొప్పున స్టాఫ్‌నర్సులను నియమించారు. జనరల్ చెకప్ కోసం వచ్చే వారిలో బీపీ, షుగర్, క్యాన్సర్ ఉన్నట్లు గుర్తిస్తే వారికి అదే కేంద్రాల్లో చికిత్స అందించడంతోపాటు మందులు కూడా ఇస్తున్నారు.

వేలల్లో బాధితులు..

జిల్లాల్లోని అన్ని మండలాల్లో గతేడాది ఇంటింటా సర్వే చేసిన ప్రకారం జిల్లాలో 79,388 మంది బీపీ, 37,239 మంది షుగర్, 454 క్యాన్సర్ బాధితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో బీపీ ఉన్న 38,647 మంది, షుగర్ బాధితులు 19,126 మంది ప్రభుత్వం ఇచ్చే మందులు వాడుతున్నారు. మిగితా వారంతా ప్రైవేట్‌లో మందులు వాడుతున్నారు. ఇదివరకు 104 వాహనాల్లో ప్రతి గ్రామానికీ వెళ్లి బీపీ, షుగర్ బాధితులకు మందులు ఇచ్చేవారు. ఆ కార్యక్రమాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో ఈఎన్‌సీడీ కేంద్రాలతోపాటు పీహెచ్‌సీల్లో మందులిచ్చే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. బీపీ, షుగర్ నియంత్రణలో లేనివారికి కాంబినేషన్ మందులు కూడా ఇస్తున్నారు. ఈ మందుల కోసం ప్రైవేట్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

బీపీ ఆపరేటర్ల పంపిణీ

బీపీ నియంత్రణలో ఉందో లేదో తెలుసుకునేందుకు ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో బీపీ ఆపరేటర్లను పంపిణీ చేసింది. అవి ఒక్కోటి రూ.10వేల విలువైనవి. సాధారణ బీపీ, ఆపరేట్లకంటే ఇవి పూర్తి ఆధునిక పరిజ్ఞానంతో తయారు చేశారు. ఏఎన్ఎంలు వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికీ తిరిగే క్రమంలో ఇళ్లలో ఉండే 30 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ బీపీ పరీక్ష నిర్వహిస్తారు. వారికి బీపీ ఉన్నట్లు గుర్తిస్తే పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీలకు రెఫర్ చేస్తారు. అంతే కాకుండా అక్కడే వారికి ప్రత్యేకంగా ఒక బుక్ ఇచ్చి మందులు కూడా ఇస్తున్నారు.

నియంత్రణలో ఉంచుకోవాలి



30 ఏళ్లు దాటితే బీపీ, షుగర్ వస్తున్నాయి. ఆహార నియమాలు పాటించి వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. జంక్‌ఫుడ్, కార్బోహైడ్రేట్, ఆల్కాహాల్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. రోజుకు 45 నిమిషాలు వ్యాయామం, వాకింగ్, యోగా చేయాలి. ప్రతినెలా చెకప్ చేసుకోవాలి. మందులు కచ్చితంగా వాడాలి. లేకుంటే అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

– శ్రీనివాస్ డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఏఎస్సై మృతి


రాజమల్లయ్య (ఫైల్)

ధర్మపురి: రక్తకణాలు తగ్గిపోయి, కాలికి గాయంతో ఇన్‌ఫెక్షన్ అయిన ఓ ఏఎస్సై చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని బంధువుల కథనం ప్రకారం.. ధర్మపురికి చెందిన కల్యాడపు రాజమల్లయ్య(60) వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్నారు. ఇటీవల జ్వరం కారణంగా రక్తకణాలు తగ్గిపోయాయి. దీంతోపాటు కాలికి గాయమై, తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు వారం రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. మృతుడికి భార్య సులీల, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే ఏఎస్సై రాజమల్లయ్య మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మెట్‌పల్లి బీడీ కాలనీవాసి..


రమేశ్ (ఫైల్)

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన రాంపల్లి రమేశ్ (47) స్థానికంగా వివిధ వ్యాపారాలకు డీలర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి పని ముగించుకొని, బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వెల్లుల్ల కాకతీయ కాల్వలో వ్యక్తి మృతదేహం

మెట్‌పల్లిరూరల్: వెల్లుల్ల శివారు కాకతీయ కాల్వలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కెనాల్‌లో ఆదివారం మృతదేహం కొట్టుకుపోతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి, గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. మృతుడు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లికి చెందిన ఏనుగు రణధీర్‌రెడ్డి(46)గా గుర్తించారు. అనంతరం అతని కుటుంబసభ్యులకు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ నెల 21న హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి, ఇంటి నుంచి వెళ్లాడని, తిరిగిరాలేదని వారు తెలిపారు. కాగా, రణధీర్‌రెడ్డికి గతంలో వివాహం జరిగి, విడాకులయ్యాయని, తర్వాత మరో మహిళను పెళ్లి చేసుకున్నప్పటికీ ఆమెతో విభేదాలు వచ్చి, ఒంటరిగా ఉంటున్నాడని తెలిసింది. మృతదేహాన్ని స్వగ్రామం తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఏడుగురికి గాయాలు

మల్యాల(చొప్పదండి): ముత్యంపేట శివారులో జగిత్యాల–కరీంనగర్ రహదారిపై ఓ ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. బల్వంతాపూర్‌కు చెందిన కుటుంబసభ్యులు ఏడుగురు ఆదివారం ఆటోలో జగిత్యాల వెళ్తున్నారు. లారీ వెనక నుంచి ఢీకొంది. ప్రమాదంలో జహంగీర్, హుస్సేన్ బీ తలకు తీవ్ర, మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదే సంఘటనలో దుబాయ్ వెళ్లేందుకు జగిత్యాల బస్టాండ్‌కు వెళ్తున్న వ్యక్తికి అదృష్టవశాత్తు గాయాలు కాలేదు. ఆటోడ్రైవర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఎల్లలు దాటొస్తున్న గంజాయి

- 'ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడు తన వాహనంపై భద్రాచలం అటవీ ప్రాంతానికి వెళ్లి, గంజాయి తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఇలా చాలా మంది కరీంనగర్ యువకులు గంజాయి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు సమాచారం.'

- 'నాలుగు రోజుల కిత్రం కరీంనగర్ మండలానికి చెందిన 10 మంది యువకులు ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా చేస్తూ ఒడిశా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది.'

- ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా కరీంనగర్‌కు దిగుమతి
- ఒడిశా పోలీసులకు చిక్కిన 10 మంది యువకులు?


పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

కరీంనగర్ క్రైం: వివిధ రాష్ట్రాల నుంచి కరీంనగర్‌కు గంజాయి దిగుమతి అవుతోంది. ఎల్లలు దాటి గంజాయి రవాణా చేస్తూ కరీంనగర్‌కు చెందిన పలువురు యువకులు ఇతర రాష్ట్రాల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొదట ఫ్యాషన్‌గా ప్రారంభించి, తర్వాత బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి సేవించడంతోపాటు జల్సాల ఖర్చుల కోసం దాన్ని వ్యాపారంగా మార్చుకొని, చాలా మంది యువకులకు అలవాటు చేస్తున్నారు. ఎక్కువ శాతం కళాశాల విద్యార్థులు, పలుచోట్ల మైనర్లు, కార్మికులకు విక్రయించి, డబ్బులు దండుకుంటున్నారు.

మన రాష్ట్రంలో దొరక్కపోవడంతో..

మన రాష్ట్రంలో గంజాయి దొరక్కపోవడంతో ఎక్కువ శాతం మంది పక్క రాష్ట్రాల మీద దృష్టి పెడుతున్నారు. పలు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి అవుతోంది. అయితే అక్కడ కొనుగోలు చేస్తే రేటు ఎక్కువగా ఉంటుందని నేరుగా ఒడిశా, చత్తీస్‌గఢ్, కర్నాటకలోని బీదర్, ఆంధ్రప్రదేశ్‌లోని అరకు సమీప ప్రాంతాలు, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలు, సీలేరుకు వెళ్లి, కరీంనగర్‌కు తీసుకువస్తున్నారు. గతంలో పలువురు పోలీసులకు చిక్కడమే ఇందుకు ఉదాహరణ.

యువతే టార్గెట్..

గంజాయి వ్యాపారులు యువతనే టార్గెట్ చేస్తున్నారు. కరీంనగర్ పట్టణంతోపాటు జిల్లాలోని పల్లెల్లోనూ గంజాయి గుప్పుమంటోంది. సాయంత్రం అయిందంటే చాలు నిర్మానుష్య ప్రాంతాల్లో ఎక్కువ మంది గంజాయి సేవిస్తున్నారు. మూతపడిన దుకాణాలు, వాగుల పరిసరాలు, శివారు ప్రాంతాలు, వాడుకలో లేని భవనాల్లో ఇది గుట్టుగా సాగుతోంది. పోలీసులు తనిఖీలు చేసి, నియంత్రించినా చాప కింద నీరులాగా గంజాయి విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. కళాశాల విద్యార్థులు, కొంతమంది మైనర్లు, కార్మికులు గంజాయికి అలవాటు పడి, తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం


పెన్షన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలకేంద్రంతోపాటు పాతదాంరాజుపల్లిలో నిర్వహించిన ఆసరా లబ్ధిదారులకు ఆదివారం పెన్షన్‌కార్డులు పంపిణీ చేశారు. పార్టీకి కార్యకర్తలే శ్రీరామ రక్ష అని, సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ఎండగట్టాలని సూచించారు. నియోజకవర్గంలో 95శాతం అభివృద్ధి పనులు పూర్తిచేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. కమ్యూనిటి హాల్స్ నిర్మాణానికి ప్రొసిడింగ్ పత్రాలు అందించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, బద్దం అంజిరెడ్డి, నేరేళ్ల మోహన్‌రెడ్డి, సర్పంచ్ మైదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు బండి లింగస్వామి, సుతారి రాజేందర్ పాల్గొన్నారు.

పట్టాలిప్పించాలని వినతి

పట్టాలు ఇప్పించాలని బంజార తండా గిరిజనులు, మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. బంజార లంబడాతండాలో 44 కుటుంబాలు ఉన్నాయని, గ్రామ శివారులోని 1040/1/1/1లోని ప్రభుత్వ భూమి 250ఎకరాలను భూపంపిణీ పథకం కింద పట్టా ఇప్పించాలని కోరారు.

అమ్మక్కపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట, డబ్బా గ్రామాలకు లోఓల్టేజ్ సమస్య తీర్చేందుకు అమ్మక్కపేటలో రూ.1.55 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించనున్న హెల్త్ సబ్‌సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అమ్మక్కపేట శివారు ఆంజనేయస్వామి గుట్ట వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే దూరప్రాంతాలకు వెళ్లకుండే ఇక్కడే మరమ్మతు చేసేలా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మక్కపేట, డబ్బా గ్రామాల్లో చెరువులు, కుంటలు నింపేందుకు వరద కాలువ నుంచి ఎత్తిపోతలకు కృషి చేస్తానన్నారు. సబ్‌స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, డీఈ గంగారం, ఏడీఈలు మనోహర్, శ్రీనివాస్‌రావు, రాజబ్రహ్మాచారి, అనుప్, ఏఈలు సతీష్, అమరేందర్, ప్రశాంత్, వినిత్‌రెడ్డి, సర్పంచులు దివ్యభారతి, గంగాధర్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, వైద్యాధికారి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలి భర్తపై చీటింగ్ కేసు

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలి భర్త ఆగంతపు వంశీపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గడ్డం అఖిల్ తాటిపల్లి శివారులో రెండున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. దానికి సంబంధించిన వివాదం పరిష్కరిస్తానని చెప్పి, వంశీ అతని వద్ద రూ.1.70 లక్షలు తీసుకున్నాడు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు కోరినా పరిష్కరించడం లేదు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే ఇవ్వడం లేదు. దీంతో అఖిల్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వంశీపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. భూ సరిహద్దు గోడ కూల్చాడని వచ్చిన ఫిర్యాదు మేరకు అఖిల్‌పైనా కేసు నమోదైంది.

బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్


గణనాథున్ని దర్శించుకున్న నవీన్‌కుమార్

మల్లాపూర్: బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని సాతారంలో గణేశుని మండపాలను సందర్శించారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ వ్యవస్థను నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. రైతుబంధు పథకం సర్వరోగ నివారిణిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించుకుంటోందని, పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి, కనీస మద్దతు ధర పొందడానికి రైతులు ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ధరణి పోర్టల్‌తో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ, కాకతీయ, ప్రాజెక్టుల పేరుతో సీఎం కేసీఆర్ కుటుంబం అందినకాడికి దోచుకుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు గున్నాల శ్రీనివాస్, నాయకులున్నారు.

అగ్ని ప్రమాద కుటుంబానికి చేయూత



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో మ్యాకల కావేరి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరిగి, వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సత్యసాయి భక్తుల సహకారంతో సమీకరించిన రూ.18 వేలు వెచ్చించి, స్టౌ, రెగ్యులేటర్, వంట పాత్రలు, బియ్యం తదితరాలు కొనుగోలు చేసి, అందించారు. సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, అర్వపెల్లి ఆనంద్, వంగల లక్ష్మీనారాయణ, దశరథరెడ్డి, ఊటూరి భాస్కర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమెట్‌పల్లిలో చిరుత సంచరిస్తోందని ప్రచారం

- హైనా అని తేల్చిన అటవీ శాఖ అధికారులు
- ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు


హైనా పాద గుర్తు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి శివారు బ్రంహ్మంగారి గుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందని గ్రామంలో ప్రచారం జరిగింది. ఆదివారం చిరుత పులి పాదాలలా ఉన్న గుర్తులను చూసి కొందరు రైతులు ఆందోళనకు గురయ్యారు. వాటిని ఫోన్‌లో ఫొటోలు తీసి, సామాజిక మాధ్యమాల్లో పెట్టటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆ ఫొటోలను అటవీ అధికారులకు వాట్సాప్ ద్వారా పంపారు. వాటిని పరిశీలించిన జగిత్యాల అటవీ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేశ్ రావు అవి చిరుత పులి పాదాల గుర్తులు కావని హైనావని తేల్చారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

హోటల్ యజమానికి నోటీసులు


నోటీసులు ఇస్తున్న ఫౌండర్ ట్రస్టీలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గతంలో చెత్తాచెదారం వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో అక్కడ ఆలయ ఫౌండర్ ట్రస్టీలు ఓ వ్యక్తితో హోటల్ ఏర్పాటు చేయించారు. ఇటీవల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భక్తుల సౌకర్యం కోసం ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీంతో పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హోటల్ యజమానిని ఖాళీ చేయాలని ఈవో కోరగా అతను నిరాకరించడంతో నోటీసులు జారీ చేశారు. వాటిని ట్రస్టీలు ఆదివారం అతనికి అందజేశారు.




విఘ్నేశునికి ప్రత్యేక పూజలు



రాయికల్: పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణేశుని విగ్రహాల వద్ద మహిళలు ఆదివారం కుంకుమ పూజలు, రాయికల్ మేరు సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బోగ శ్రావణి, పడాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ బంద్

- మెషిన్స్ వెనక్కి పంపాలని ఆదేశాలు
- టీచర్లు పాఠశాలలకు సకాలంలో హాజరయ్యేనా?
- కొనసాగించాలంటున్న తల్లిదండ్రులు


బయోమెట్రిక్ మెషిన్

జగిత్యాల: ప్రభుత్వ ఉపాధ్యాయులు పారదర్శకంగా విధులు నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గతంలో బయోమెట్రిక్ సిస్టమ్ తీసుకువచ్చింది. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా 15 జిల్లాల్లో మెషిన్లు ఏర్పాటు చేశారు. వాటిలో జగిత్యాల కూడా ఉంది. బయోమెట్రిక్ సిస్టమ్ నిర్వహణను ఒక ఏజెన్సీకి ఇవ్వగా మెషిన్స్ పనితీరు, నెట్‌వర్క్‌ను వారే చూసేవారు. దీంతో ప్రతీ ఉపాధ్యాయుడు సరైన సమయానికి వచ్చేవారు. బయోమెట్రిక్ పడకపోతే ఆరోజు పాఠశాలకు రానట్లు పరిగణించేవారు. ఈ క్రమంలో సదరు ఏజెన్సీకి సంబంధించిన కాంట్రాక్టు గడువు ముగిసిపోవడంతో బయోమెట్రిక్ సిస్టమ్‌ను తొలగిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితంగా గత బుధవారం నుంచి బయోమెట్రిక్ సిస్టమ్‌ను బంద్ చేశారు.

యాప్ ద్వారా హాజరుకు చర్యలు?

బయోమెట్రిక్ సిస్టమ్ తొలగించడంతో టీచర్లు సకాలంలో పాఠశాలలకు హాజరవుతారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ యాప్ ద్వారా ప్రతీ విద్యార్థి ఫోటో తీస్తున్నారు. పిల్లల హాజరు శాతం పెంపొందించేందుకు దీన్ని రూపొందించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ప్రభుత్వానికి ఖర్చు సైతం రావడంతో ఈ యాప్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. తాజాగా ఉత్తర్వులు జారీ కావడంతో వెంటనే ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు బయోమెట్రిక్ మెషిన్లను వెనక్కి పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బయోమెట్రిక్ సిస్టమ్ ఉంటేనే బాగుంటుందని, దీన్ని కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మెషిన్స్ పంపించాలని ఆదేశించాం



బయోమెట్రిక్ సిస్టమ్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంటనే మెషన్స్ పంపించాలని ఎంఈవోలకు, సంబంధిత హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం నుంచి మళ్లీ ఉత్తర్వులు వచ్చేంత వరకు బయోమెట్రిక్ సిస్టమ్ ఉండదు.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించాలి

- నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం
- డీఎస్పీ వెంకటస్వామి


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటస్వామి

ధర్మపురి: అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు, నేరాలను నియంత్రించేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. ధర్మపురి పట్టణంలోని దుర్గమ్మ, గిరుకల కాలనీల్లో ఆదివారం ఉదయం సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన ఎస్సైలు, పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 60 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలను సీజ్ చేసి, రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు. ప్రజలకు రక్షణ, భద్రతపై భరోసా కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పట్టణంలోకి కొత్త వ్యక్తులు వచ్చినా, నేరస్తులు షెల్టర్ తీసుకున్నా కార్డెన్ సెర్చ్ ద్వారా తెలుస్తుందన్నారు. వాహనదారులు తమ వాహనాలకు తప్పక రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ, శ్వేత, సందీప్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వీడని జల మర్డర్ మిస్టరీ

- భయాందోళనలో కాలనీవాసులు
- బంధువులే హత్య చేశారన్న కోణంలో పోలీసుల విచారణ


జల (ఫైల్)

రాయికల్: పట్టణంలోని నాగారాం వాడకు చెందిన కోల జల పట్టపగలే దారుణ హత్యకు గురై, 26 రోజులు గడిసినా మర్డర్ మిస్టరీ వీడటం లేదు. గత ఆగస్టు 29న మధ్యాహ్నం 2 గంటల సమయంలో దుండగులు జల ఇంట్లోకి వెళ్లి, ఆమెను హత్య చేసి, పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించినప్పటికీ అసలు విషయం తెలియడం లేదు. మృతురాలి భర్త, కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. ఆస్తి తగాదాల విషయంలో బంధువులే జలను హత్య చేశారన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా హత్య చేసినట్లు దుండగుడు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. మృతురాలి పుస్తెల తాడు రికవరీలో జాప్యం జరుగుతుండటంతో పోలీసులు సైతం అధికారికంగా ధ్రువీకరించక లేపోతున్నారు. మర్డర్ మిస్టరీ వీడకపోవడంతో కాలనీవాసులు సైతం భయభ్రాంతులకు గురువుతున్నారు. ఈ విషయమై ఎస్సై అజయ్‌ను వివరణ కోరగా విచారణ చేపడుతున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి


నిరసన తెలుపుతున్న సురక్షా సమితి ప్రతినిధులు

జగిత్యాలటౌన్: నిర్లక్ష్యంతో రెండుసార్లు గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దుకు కారణమైన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీలను బర్తరఫ్ చేయాలని, పరీక్ష పారదర్శకంగా నిర్వహించాలని భారత్ సురక్షా సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో టీఎస్‌పీఎస్సీ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సమితి రాష్ట్ర కార్యదర్శి ఏసీఎస్.రాజు మాట్లాడుతూ.. గ్రూప్–1 పరీక్ష నిర్వహించడంలో వైఫల్యం చెంది, లక్షలాది మంది నిరుద్యోగ యువత రోడ్డున పడేందుకు కారణమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. హైకోర్టు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేస్తూ తీర్పునివ్వడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీపై చిత్తశుద్ధి లేని బీఆర్‌ఎస్ సర్కారు ఓట్ల కోసం నోటిఫికేషన్లు ఇస్తోందని, తర్వాత పేపర్ లీకేజీలు చేయిస్తోందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాలన చేసి, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. గంగాధర్, శ్రీనివాస్, దుబ్బరాజం, లక్ష్మారెడ్డి, సూర్యప్రకాశ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లండ్ బార్ కౌన్సిల్ చైర్మన్‌తో సమావేశం


చైర్మన్ శ్యామూల్‌తో జగిత్యాల న్యాయవాదులు


సదస్సులో తోటి న్యాయవాదులతో దివాకర్‌రెడ్డి

జగిత్యాలజోన్: ఢిల్లీలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ అడ్వకేట్స్ కాన్ఫరెన్స్‌లో జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్వీ.సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంగ్లండ్ బార్ కౌన్సిల్ చైర్మన్ శ్యామూల్ టోనడ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు దేశాల్లో అమలవుతున్న చట్టాలు, శిక్షల గురించి తెలుసుకున్నారు. రెండో రోజు సెషన్‌లో క్రిమినల్ లా లో మార్పులు, చేర్పులు, ఉన్నత స్థాయిలో లీగల్ ప్రొఫెషన్ నిర్మాణం, రానున్న రోజుల్లో న్యాయ విద్య తదితర అంశాలపై సుప్రీంకోర్టు జడ్జిలు ప్రసంగించారని పేర్కొన్నారు. అలాగే, ముగింపు సెషన్‌కు కేంద్ర హోం మంత్రి అమితా షా హాజరై, మార్చబోతున్న క్రిమినల్ చట్టాలపై వివరించినట్లు తెలిపారు.

సదస్సుకు లాయర్ దివాకర్‌రెడ్డి హాజరు

మెట్‌పల్లి: ఇంటర్నేషనల్ అడ్వకేట్స్ కాన్ఫరెన్స్‌లో వేంపేటకు చెందిన లాయర్ అల్లూరి దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్న ఈ సదస్సుకు హాజరవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.